

బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

## పోచమ్మ బోనాలు

జూలపల్లి, ఫిబ్రవరి 18 : అబ్బాపూర్‌లో సమ్మక్క జాతర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఆలయానికి తరలి వెళ్లారు. దేవతామూర్తులకు బోనాలు నైవేద్యంగా సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. సమ్మక్క ఉత్సవాలు ఏ లాంటి ఆటంకాలు లేకుండా కొనసాగేలా సల్లంగా చూడాలని వేడుకున్నారు. కమిటీ చైర్మన్ పసునూటి శ్రీనివాస్, నాయకులు బొడిగె లక్ష్మీనారాయణ, గొడిశెల ధర్మయ్య, గాండ్ల చంద్రయ్య, పసునూటి రాజిరెడ్డి, గాండ్ల మోహన్, అరికోల్ల రాములు, బాల్సాని శ్రీనివాస్, జంగి లి మల్లయ్య, దేవసాని లక్ష్మీపతి, జంగిలి లచ్చయ్య, కత్తెర్ల వెంకటయ్య, కత్తెర్ల రాజే శం, బొమ్మనవేని కొమురయ్య పాల్గొన్నారు.

## మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు

**ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు**



స్పెషల్ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, ఆర్టీసీ అధికారులు

పెద్దపల్లి, ఫిబ్రవరి18: మేడారం జాతరకు పెద్దపల్లి నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆర్టీసీ బస్సులకు జిల్లా కేంద్రంలోని ఐటీఐ మైదానంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మేడారం జాతరకు వెళ్లే భక్తుల రవాణా అవసరాల కోసం ఆర్టీసీ పెద్దపల్లి నుంచి 200 ప్రత్యేక బస్సులను నడుపుతుందని వెల్లడించారు. మేడారం వెళ్లే మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం వర్తిస్తుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతగా వ్యవహరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర పెద్దపల్లి పాయింట్ ఇన్‌చార్జిలు జగిత్యాల డీఎం సునీత, కోరుట్ల డీఎం ఐ విజయమాధురి, ప్రజాప్రతినిధులు, నాయకులు నూగిళ్ల మల్లయ్య, సంపత్, ప్రకాశ్‌రావు, శ్రీనివాస్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది కే రాంగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, రాములు, కోటి, ఎస్‌కే హైమద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**మేడారం స్పెషల్ బస్సులు ప్రారంభం**

మంథని, ఫిబ్రవరి 18: మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు మంథని నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను డిపో మేనేజర్ అలువాల రాజశేఖరం, ఆర్టీసీ అధికారులు ఆదివారం ప్రారంభించారు. మంథని డిపో నుంచి 210 బస్సులను మేడారం నడిపిస్తున్నామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం మంథని ఆర్టీసీ బస్టాండ్‌లో టెంట్లు, వాటర్, టాయిలెట్లు, లైట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. మంథని నుంచి మేడారం పెద్దలకు రూ.320, పిల్లలకు రూ. 180గా టికెట్ ధరను నిర్ణయించామని, మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎంలు మురళీకృష్ణ, వేదవతి, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440-All
PLOT FOR SALE
★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, మౌంట్ ఒపేర, గ్రీన్ సిటీ, సుచిరిండియాలో ప్లాట్లు కొనబడును. నో Brokrs. 9553973999 / 6303049720.
NT-313892
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

### వివాహ వేడుకలకు హాజరైన ఈశ్వర్

ధర్మారం,ఫిబ్రవరి18: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం జరిగిన వివాహ వేడుకలకు బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరయ్యారు. సాయంపేట, నంది మేడారం,లంబాడి తండా (బీ) గ్రామాల్లో జరిగిన వివాహాలకు హాజరై వధూవరులను ఆయన ఆశీర్వదించారు.ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

### 20 నుంచి బ్రహ్మోత్సవాలు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి20: మండల కేంద్రంలోని హరిహర దేవాలయంలో ఈనెల20 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు ఎరబాటి రాజేశ్వర్‌రావు తెలిపారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

### క్యాంపు కార్యాలయంలోకి విప్

ధర్మపురి, ఫిబ్రవరి 18 : ధర్మపురి ఎమ్మె ల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా పురోహితులు ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదించారు.

# కౌన్సిల్ సమావేశాలు ఇక లేనట్టేనా...?

- ఊసే లేని కళా భవన్ నిర్మాణం
- వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశం వాయిదా
- నగరంలో పెట్రేగుతున్న అక్రమ నిర్మాణాలు



కౌన్సిల్ సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు (ఫైల్)

కోల్‌సిటీ,ఫిబ్రవరి 18: రామగుండం నగర పాలక సంస్థలో పరిపాలన చిక్కులు మొదలయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం కొరవడి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా తయారైంది. గడిచిన మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. ఇదే విషయమై ఎవరికి చెప్పుకోలేక, అటు డివిజన్లలో ప్రజలకు ముఖాలు చూపించలేక కార్పొరేటర్లు పడరాని పాట్లు పడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ 28వ డివిజన్‌లో రూ.4 కోట్లతో నిర్మించ తలపెట్టిన కళాభవన్ ఊసే ఎత్తడం లేదు. ఇవేగాక పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలో నిర్మిస్తున్న అధునాతన షాపింగ్ మాల్ నత్తకే నడకను నేర్పిస్తున్నట్లు కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ రూపకల్పన, ఆమోదంపై గత శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయం లో జరగాల్సిన అత్యవసర సమావేశాన్ని కూడా అర్ధాంతరంగా వాయిదా వేయడంపై పలువురు కార్పొరేటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**కౌన్సిల్ సభలు మరిచారా?**

ఇక ప్రతి నెల నిర్వహించాల్సిన కౌన్సిల్ సభలు ఇక అటకెక్కే పరిస్థితి నెలకొంది. గడిచిన 3 నెలలుగా కౌన్సిల్ సమావేశాల ఊసే ఎత్తడం లేదు. కార్పొరేషన్‌లో మెజార్టీగా ఉన్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలని పలుమార్లు మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకవెళ్లినా ఎందుకు సమావేశాలు నిర్వహించడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులకు సంబంధించి డ్రైనేజీలు, రోడ్లు, ఇతరత్రా భవనాల నిర్మాణాలు ఎన్నికలకు ముందు కోడ్ మూలంగా ఆగిపోయాయి. ఎన్నికల అనంతరం ఆ పనులు పునరుద్ధరణకు ఇప్పటికీ నోచుకోవడం లేదు.దీనితో డివిజన్లలో కార్పొరేటర్లు ప్రజల ముందుకు రాలేకపోతున్నారు. నగర పాలక సంస్థ 8వ డివిజన్‌కు చెందిన కార్పొరేటర్ ఇదే విషయమై పలుమార్లు కార్యాలయానికి వచ్చి మేయర్‌ను పలుమార్లు నిలదీశారు. తమ డివిజన్‌లో ఎక్కడి పనులు అక్క డే నిలిచిపోయాయని, ఇంజినీరింగ్ అధికారులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు పంపించాలని కార్పొరేటర్ కార్యాలయం సాక్షిగా తన గోడు వెల్లబోసుకున్నా ప్రయోజనం కనిపించడం లేదు. ఇదే పరిస్థితి ప్రతి డివిజన్‌లోనూ నెలకొంది.

**కళాభవన్ నిర్మాణం కోసం ఎదురుచూపులు**

కాగా, 28వ డివిజన్ పరిధి గోదావరిఖని హనుమాన్ నగర్‌లో తలపెట్టిన కళా భవన్ నిర్మాణ పనుల కోసం కళాకారులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలోనే ఇక్కడ కళాభవన్ నిర్మాణానికి పాలక వర్గం రూ.4 కోట్ల అంచనా వ్యయంతో నివేదికలు తయారు చేసి కౌన్సిల్‌లో ఆమోదం తెలిపి టెండర్లు పిలిచింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆ పనులు నిలిచిపోయాయి. గత ఏడాది ఈ పనులను మళ్లీ రీ టెండర్ పిలిచి భూమిపూజ కూడా చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోగా, ఆనక ఆ పనులు మళ్లీ షరామామూలేనా అంటూ కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని పనులు ముందుకు సాగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై డివిజన్ కార్పొరేటర్ పులేందర్ కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకవద్దామంటే ఆ సభలే జరగడం లేదని, ఎవరికి చెప్పాలో తెలియడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**బడ్జెట్ సమావేశం వాయిదా...**

కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సవరించిన, 2024-25 సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్‌ను పరిశీలించి ఆమోదించడానికి గత శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించ తలపెట్టిన ప్రత్యేక సమావేశాన్ని కూడా వాయిదా వేశారు. కనీసం ఈ సమావేశాన్ని వేదికగా చేసుకొని పలు అభివృద్ధి పనుల్లో నెలకొంటున్న జాప్యం, అధికారుల తీరుపై ప్రశ్నించి సమస్యలను పరిష్కరించుకుందామనుకున్న పలువురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు నిరాశే మిగిలిపోయిందని బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

### బైక్‌పై నుంచి పడి ఒకరికి గాయాలు

- దవాఖానకు తరలించిన మాజీ ఎంపీపీ

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి18: మండలంలోని గంగారం వద్ద మల్లయ్య అనే వ్యక్తి ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడ్డాడు. కాల్వశ్రీరాంపూర్ నుంచి పెద్దపల్లికి వెళ్తున్న మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్ సంఘటనా స్థలంలో బాధితుడిని చూసి తన కారులో పెద్దపల్లి దవాఖాన కు తరలించి మానవత్వం చాటుకున్నారు. కాగా బాధితుడు టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన మల్లయ్యగా గుర్తించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ ఓంకార్ పరిశీలించారు.

### చింత చెట్టుపై నుంచి పడి ఒకరి మృతి

ధర్మారం,ఫిబ్రవరి18: నంది మేడారంలో చింత చెట్టుపై నుంచి పడి పీసు రఘునందన్ రెడ్డి (65) మరణించాడు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. రఘునందన్ రెడ్డి చింత కాయలు తెంపేందుకు చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో కాలు జారి ఆ వ్యక్తి కింద పడడంతో తలకు తీవ్రమైన గాయమైంది.దీంతో కుటుంబ సభ్యులు రఘునందన్ రెడ్డిని కరీంనగర్‌లోని ప్రభుత్వ దవఖానకు తరలించగా అప్పటికే పరిస్థితి విషమించి మరణించినట్లు డాక్టర్ ధ్రువీకరించినట్లు ఎస్ఐ తెలి పారు. కొడుకు రవీందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

# నాలుగు నెలలుగా కదలని పనులు

- 'డబుల్ రోడ్డు పనులకు రూ.19.80 కోట్లు కేటాయింపు



జూలపల్లి-పెద్దపల్లి మధ్య నిలిచిన డబుల్ రోడ్డు పనులు

జూలపల్లి, ఫిబ్రవరి 18 : జూలపల్లి-పెద్దపల్లి మధ్య డబుల్ రోడ్డు పనులు దాదాపు నాలుగు నెలల నుంచి నిలిచిపోయాయి. ఏండ్ల తరబడి అరిగోస పడిన ప్రయాణ కష్టాలు దూరం కాకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతుంది. పూర్తిగా శిథిలమైన తారు రోడ్డును మెరుగు పర్చడానికి బీఆర్‌ఎస్ సర్కారు రూ.19.80 కోట్లు మంజూరు చేసింది. ఈ క్రమంలో సదరు గుత్తేదారు నాలుగు నెల క్రితం మొక్కుబడిగా పనులు మొదలు పెట్టి వదిలి పెట్టాడు. డబుల్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా జూలపల్లి నుంచి వడ్కాపూర్ దాకా రోడ్డు చదును చేసి ఆపేశారు. రోడ్డుకు రెండు వైపులా చెట్లు తొలగించారు. పనులు వేగవంతం చేయకపోవడం ప్రయాణిలకు శాపంగా మారుతున్నది. వాహనాల రాకపోకలతో విపరీతంగా దుమ్ము లేచి రహదారి కనిపించక రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. మొక్కుబడిగా రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టి ఇరువైపులా చెట్లు తొలగించారు. రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయించాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

**పనులు పూర్తి చేయాలి**



డబుల్ రోడ్డు పనులు ఆలస్యం లేకుండా పూర్తి చేయించాలి. పెద్దపల్లికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నం. రోడ్డుపై దుమ్ము, కంకర లేవడంతో అరోగ్య సమస్యలు తెలుత్తుతున్నయ్. రహదారిపై ప్రయాణం చేయడం కష్టంగా మారుతుంది. వెంటనే రోడ్డు పనులు మొదలు పెట్టి పూర్తి చేస్తే సౌకర్యంగా ఉంటుంది.

**నాగుల శ్రీనివాస్, చిరు వ్యాపారి (జూలపల్లి)**

**చాలా ఇబ్బందులు పడుతున్నం**



జూలపల్లి-పెద్దపల్లి మధ్య రోడ్డు అధ్వాన్నంగా ఉంది. పెద్దపల్లికి వెళ్లి రావడం అంటే నరకంగా మారుతుంది. ఆటోలు, జీపులు, ద్విచక్ర వాహనాలు దెబ్బతింటున్నాయి. ఈ రహదారిపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నరు. రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయిస్తే కష్టాలు దూరమైతయ్. రోడ్డు పనులు చురుగ్గా కొనసాగించడానికి చర్యలుతీసుకోవాలి.

**సూర యోసఫ్, ఆటో డ్రైవర్ (కుమ్మరికుంట)**



మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్

# ప్రజలకు మెరుగైన సేవలందించాలి

మంథని, ఫిబ్రవరి 18: పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా సేవలందించాలని గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్ సూచించారు. ఇటీవల గోదావరిఖని ఏసీపీగా బాధ్యతలుగా స్వీకరించిన అనంతరం తొలి సారి ఆయన మంథని పోలీస్ స్టేషన్‌ను ఆదివారం సందర్శించారు. ఠాణాలోని రికార్డులను పరిశీలించడంతో పాటు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా తమ విధులను నిర్వర్తించాలన్నారు. అదే విధంగా సైబర్ క్రైమ్, గంజాయి వినియోగదారులు, సరఫరాదారులపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో సమర్థవంతంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంథని సీఐ రాజు, ఎస్ఐలు వెంకట్‌కృష్ణ, రాణి, పోలీసులు పాల్గొన్నారు.

# సింగరేణిలో జీవో 22 అమలు చేయాలి

గోదావరిఖని, ఫిబ్రవరి 18: సింగరేణిలో పని చేస్తున్న దాదాపు 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు జీవో 22ను అమలు చేసి వారి వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సింగరేణి డైరెక్టర్ శ్రీనివాస్‌కు శనివారం రాత్రి ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి శనగల శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని గత సంవత్సరం సమ్మె చేయడంతో యూనియన్లతో యాజమాన్యం చేసుకున్న ఒప్పందం ప్రకారం తెలంగాణ ప్రభుత్వ జీవో 22ను అమలు చేసి వారి వేతనాలు పెంచుతామని చెప్పారని, ఒప్పందం జరిగి ఇప్పటికి సంవత్సరం దాటినా యాజమాన్యం అమలు చేయకపోవడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ జీవో అమలు గురించి తీసుకవెళ్లి గెజిట్ విడుదల చేయించి అమలు చేస్తామని చెప్పిన యాజమాన్యం ఇంతవరకు దాని ఊసే లేదని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులకు వేతనం పెంపు వర్తింపచేయాలని, సొంతింటి పథకానికి 3 లక్షలు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయాలని, తెలంగాణలో షెడ్యూల్ ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనం పెంచుతూ ప్రభుత్వం 30జూన్ 2002న 22 జీవోను విడుదల చేసిందన్నారు. జీవో ప్రకారం సింగరేణిలో పని చేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు అమలు చేస్తే మేలు జరుగుతుందన్నారు. ప్రస్తుతం సింగరేణిలో సివిక్‌లో పని చేస్తున్న కార్మికులకు ఓబీ వర్కర్లకు ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు చెల్లిస్తున్న వేతనాలు వారి కుటుంబాలు గడిచేలా లేవనీ, అప్పులు, అర్ధాకలితో కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలు చీకటిలో బతుకుతూ ఇబ్బంది పడుతున్నారని, తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 22 ప్రకారం వేతనాలు చెల్లించడం వల్ల 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు కొంత ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో తొడుపునూరి రమేశ్ ఉన్నారు.

# గద్దెలపై వనదేవతల ప్రతిమల ప్రతిష్ఠాపన



సమ్మక్క గద్దెలపై వనదేవతల ప్రతిష్ఠాపంలో ఉత్సవ కమిటీ సభ్యులు

ధర్మారం,ఫిబ్రవరి18: మండల కేంద్రం శివారులోని శీతల చెరువులోని గుట్టల వద్ద రెండో సారి సమ్మక్క,సారలమ్మ జాతర నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇక్కడ 2022లో తొలిసారి సమ్మక్క,సారలమ్మ వెలియడంతో తాత్కాలికంగా గద్దెలను నిర్మించి ఆ ఏడాది ఘనంగా జాతర నిర్వహించారు. ఈ క్రమంలో రెండేండ్ల తర్వాత ఈ సారి ఇక్కడ పెద్ద ఎత్తున జాతర నిర్వహించటానికి ఉత్సవ కమిటి కన్వీనర్ మేడవేని తిరుపతి,కోశాధికారి ఓరెం చిరంజీవి, సభ్యుల అధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో జాతర నిర్వహించే ప్రదేశంలో శాశ్వత ప్రాతిపదికన పెద్ద పరిమాణంలో కొత్తగా సమ్మక్క, సారలమ్మ, పడిగిడిద్దె రాజు, గోవింద రాజు కోసం గద్దెలను నిర్మించారు.దీంతో ఆ గద్దెలపై వన దేవత ప్రతిమల ప్రతిష్ఠాపన కోసం ఆదివారం గ్రామంలో పోచమ్మ,ఎల్లమ్మ గుడి వద్ద,చెరువు వద్ద ఉన్న కట్ట మైసమ్మ,కొత్తగా నిర్మించిన సమ్మక్క గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వనదేవత ప్రతిమలను జాతర ఉత్సవ కమిటి సభ్యుల అధ్వర్యంలో గ్రామం నుంచి డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకెళ్లి కోయపూజారి అధ్వర్యంలో గద్దెలపై ప్రతిష్ఠించారు.ఇక్కడ అన్ని ఏర్పాట్లు పూర్తయిన నేపథ్యంలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే జాతర ఉత్సవాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

# అనుమతులు లేకుండా బెల్లం విక్రయాలు



కోల్‌సిటీ, ఫిబ్రవరి 18: సమ్మక్క-సారలమ్మ జాతర అనగానే ముందుగా అమ్మవార్లకు నిలువెత్తు బంగారం ముట్టజెప్పడం ఆనవాయితీ. వన దేవతలకు నైవేద్యంగా అనాదిగా ఎత్తు బంగారం (బెల్లం)ను భక్తులు సమర్పిస్తుంటారు. మొక్కులు తీరిన వారు స్థానికంగా నిలువెత్తు బంగారం కొనుగోలు చేసి వాటిని మొదటికి (మేడారం)కు తీసుకవెళ్లి అమ్మవార్లకు సమర్పిస్తుంటారు. దీంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో బంగారం (బెల్లం) విక్రయాలు మరింతగా ఊపందుకున్నాయి. ఇక్కడి వరకు బాగానే ఉన్నా కొంతమంది వ్యాపారులు ఇదే అదనుగా దోపిడీకి పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు లోబడి అనుమతులు కొందరు మాత్రమే తీసుకోగా, నగరంలో మాత్రం ఎక్కడ చూసినా గల్లీగల్లీకి ఈ బెల్లం విక్రయాలు జోరుగా కనిపిస్తున్నాయి. వాస్తవానికి జాతర సమయంలో మాత్రమే బెల్లం విక్రయాలకు ఎక్సైజ్ అధికారులు నిబంధనలకు లోబడి కొంత మందికి మాత్రమే అనుమతులు ఇస్తుంటారు. కానీ, గోదావరిఖనిలో కొద్ది రోజులుగా అనుమతులు లేకుండానే కొంతమంది వ్యాపారులు పెద్ద మొత్తంలో ఇతర ప్రాంతాల నుంచి బంగారం (బెల్లం) దిగుమతి చేసుకున్నట్లు తెలుస్తుంది. కిలో బెల్లం రూ.37 నుంచి రూ.40 చొప్పున విక్రయిస్తూ భక్తులను నిలువునా దోపిడీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. నగరంలోని గల్లీ గల్లీలో సాధారణ దుకాణాల్లో కూడా బెల్లం కుప్పలు కుప్పలుగా పెట్టి విక్రయిస్తుండడం గమనార్హం. ఈ వ్యాపారం బాహాటంగానే జరుగుతున్నా ఎక్సైజ్ పోలీసులు మాత్రం కనీసం పర్యవేక్షించడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని దుకాణాల వ్యాపారులు రహస్య ప్రాంతంలో బెల్లం నిల్వలు ఏర్పాటు చేసుకొని భక్తులు వచ్చినప్పుడు మాత్రమే బయటకు తీసుకవచ్చి విక్రయిస్తున్నారు. ఏలాంటి అనుమతులు లేకుండా సందిట్లో సడేమియాగా బ్లాక్ మార్కెట్ నుంచి పెద్ద మొత్తంలో బెల్లం కొనుగోలు చేసి బంగారం రూపంలో భక్తులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులపై చర్య లు తీసుకోవాల్సిన బాధ్యత ఎక్సైజ్ పోలీసులపై ఉంది.

### బౌద్ధ సొసైటీని సందర్శించిన జడ్పీ చైర్మన్



అంబేద్కర్, రమాబాయి విగ్రహాలకు నివాళులర్పిస్తున్న పుట్ట మధూకర్

మంథని, ఫిబ్రవరి 18: విశాఖపట్నంలోని బౌద్ధ సొసైటీని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా బౌద్ధ సొసైటీలోని బీఆర్‌అంబేద్కర్, రమాబాయి, బుద్ధుని విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, అంబేద్కర్ భవన్ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణ్‌రావు, మెంబర్ బొడ్డు రాజు ఉన్నారు.

### కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 18 : జగిత్యాల అర్బన్ మండలంలోని మోతె గ్రామానికి చెందిన అత్తెన మల్లేశం రైతుకు చెందిన గొర్రెల మందపై శనివారం అర్ధరాత్రి ఊరకుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 30 గొర్రెలకు పైగా చనిపోగా మరికొన్ని గాయపడ్డాయి. సుమారు రూ,3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని మల్లేశం ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వ పరంగా తనకు సహాయం అందించాలని అధికారులను కోరాడు. కుక్కల బెడద లేకుండా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.




విహార యాత్రలో వాణి పాఠశాల విద్యార్థులు

### విహార యాత్రకు విద్యార్థులు

రామగిరి, ఫిబ్రవరి 18: మండలంలోని సెంటినరీకాలనీలో గల వాణీ సెకండరీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఆది వారం విహార యాత్రకు వెళ్లారు. ట్రినిటీ విద్యా సంస్థల కరస్పాండెంట్ దాసరి ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు రెండు బస్సులలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. వండర్ లాకు వెళ్లడంతోపాటు సచివాలయం, బిర్లా మందిర్, అంబేద్కర్ విగ్రహం పార్కును సందర్శించారు. 6,7,8,9వ తరగతి విద్యార్థులను సందర్శనకు తీసుకవెళ్లారు. వీరి వెంట ప్రిన్సిపాల్ ఖయ్యూం, వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలీల, పీఈటీ తిరుపతి, తాజుద్దీన్, కుమారస్వామి, లక్ష్మి వెళ్లారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ ఆరెల్లి దేవక్క, నాయకులు

### సీసీ రోడ్డు ప్రారంభం

రామగిరి, ఫిబ్రవరి 18: మండలంలోని రత్నాపూర్ జీపీ పరిధిలోని 7వ వార్డు కాకతీయ స్కూలు వరకు ఐటీ పరిశ్రమల, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణంకు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొంరయ్య, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ రామగిరి మండల అధ్యక్షులు రొడ్డ బాపన్న, మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు బండారి సదానందం తదితరులు పాల్గొన్నారు.